# ఓ స్త్రీ! నీకు రక్షణ ఎక్కడ? ఎక్కడ?

"అమ్మా, మీ చీటీ డాక్టరుగారికి ఇచ్చాను. లోపలికి రమ్మంటున్నారు" నౌకరు చెప్పాడు.

అప్పటివరకూ నిమిషాలు లెక్కబెట్టుకుంటూ, విజిటర్సు బెంచీమీద కూర్చుని, ఎప్పుడు డాక్టరు పిలుస్తాడాని ఎదురుచూస్తున్న సుమలత, దిగ్గునలేచి డాక్టరు ఉన్నగదిలోకి వెళ్ళింది.

నమస్కారంచేసి ఆయన చూపించిన కుర్చీలో కూర్చున్నది.

"వచ్చినపని చెప్పండి" అన్నాడు డాక్టరు గడియారం చూసుకుంటూ.

"నేను ఒక పేషంటును చూడటానికి పర్మిషన్ ఇవ్వమని అడగటానికి వచ్చాను" గబగబాచెప్పింది.

''పేరు?''

''సుమలత''

''ఆమె ఇక్కడ ఎంతకాలంనుంచీ ఉన్నది? ఆమె పేరు?''

''పేషంటు పేరు రమాదేవి.''

''ఆఁ హాఁ, మీపేరా సుమలత? ఆమె మీకు ఏంకావాలి?''

''ఆమె నా ప్రాణం. బాల్యస్నేహితురాలు. మేమిద్దరంకలిసి ఒకస్కూల్లో ఒక కాలేజిలో చదువుకున్నాము.''

''ఇంతకూ ఆమె ఇక్కడ ఎంతకాలంనుంచీ ఉన్నదో చెప్పలేదు?''

"నేను ఈ ఊళ్ళో ఉండేదాన్నికాదు. నాకు ఇటీవలే తెలిసింది ఆమె ఇక్కడ ఉన్నదని. ఆమె తల్లిదండ్రులనడిగి ధృవపరచుకుని చూడాలనివచ్చాను."

"కొంచెం ఆగవలసి ఉంటుంది. నేను చెప్పినప్పుడువెళ్ళి చూద్దురుగాని"

తలఊపి సుమలత బైటకివచ్చి తన యధాస్థానంలోకూర్చుని నిరీక్షిస్తున్నది. అప్పటికే ఆ బెంచీమీద నలుగురు స్త్రీలు కూర్చునిఉన్నారు. ఎదురుగాఉన్న బెంచీమీద పదిమంది పురుషులు కూర్చునిఉన్నారు.

ఆయాలూ, నర్సులూ, వార్డుబాయ్‌లు ఇటూఅటూ తిరుగుతున్నారు.

గంట....గంటన్నర అయింది.

పన్నెండుదాటితే రోగులు భోజనాలు చేసేవేళ. వాళ్ళు పారిపోకుండా హాలు తలుపులువేస్తారు.

వచ్చిపోయే ఆయాలనుపిలిచి "నేను రమాదేవి అనే ఆమెను చూడటానికి వచ్చాను. కొంచెమాగమన్నారు. ఈ చీటీ డాక్టరుగారికి చూపించు" అంటూ ఆమె చేతిలో రెండురూపాయలు పెట్టింది.

ఆయా తలఊపి వెళ్ళింది. కాని ఎంత సేపటికీ తిరిగిరాలేదు.

సుమలత స్నేహితురాలిని చూడటానికే ఆఊరువచ్చింది. ఆమె అన్నగారినీ తండ్రినీ కలుసుకుంది.

"మేముచూసే నాలుగునెలలయింది. లోపలికి ఎవరినీ పోనివ్వరు. ఆమెను బయటికివచ్చి మాట్లాడనివ్వరు. గంటలకొద్దీకూర్చుని తిరిగివచ్చాము. నీవు చూడ గలిగితే చూసిరా. ఎట్లాఉన్నదోచూసిచెప్పు?" అన్నారు క్రుంగిన హృదయాలతో.

"ఆమెను అక్కడ చేర్పించినదెవరు?"

"చేసుకున్నవాడితో కాపరంచేసే ముగ్గురుపిల్లలతల్లి. సుఖంగాఉన్నారను కున్నాంగాని-అతడు పిచ్చాసుపత్రిలోచేర్చి కబురుచేస్తాడనుకోలేదు. అక్కడ చేర్పించేముందు తెలిస్తే కంటితోచూసేవాళ్ళం ముగ్గురుపిల్లలు. పెద్దవాడు పదవ క్లాసులో మొన్ననేచేరాడు. రెండవది ఆడపిల్ల పద్నాలుగేళ్ళది. మూడోవాడు తొమ్మిదేళ్ళవాడు. అంతా చదువుకునేపిల్లలు. ఇంట్లో మరోదిక్కులేదు. ఎవరు వండుతున్నారో-ఎవరు పెడుతున్నారో తెలియదు. పిల్లలను మాదగ్గరికి పంపమని అడిగితే పంపనన్నాడు."

పిచ్చాసుపత్రి అనగానే ఉలిక్కిపడ్డది సుమలత.

"అక్కడెందుకు చేర్చాడు?"

"ఏమో? ఏసంగతీ మాకు తెలియనివ్వలేదు. అడగ్గా అడగ్గా "దానికి పిచ్చి ఎక్కింది. కనబడ్డవాళ్ళందరినీ కొట్టటం-తిట్టటం, ఇంట్లోఉన్న వస్తువులన్నీ బైట పడెయ్యటం పగలగొట్టటం మొదలుపెట్టింది. మతిచలించిందని డాక్టరన్నాడు. పోలీసువాళ్ళకు ఫోనుచేస్తే తీసుకువెళ్ళి అక్కడ చేర్పించారు" అన్నాడు. మమ్మల్ని ఇంట్లోకి రానివ్వలేదు. బైట నిలబెట్టేమాట్లాడి పంపించేశాడు అల్లుడు" గొల్లుమన్నారిద్దరూ.

సుమలత విజటర్సు బెంచీమీదకూర్చుని ఉండగానే రెండుగంటలయింది. పొద్దున తొమ్మిదిగంటలకు హోటల్లో కాఫీటిఫిన్ తీసుకునివచ్చింది. ఆకలి మండిపోతున్నది.

ఎంతసేపని ఎదురుచూడటం?

బైటికివెళ్ళి కాఫీ టిఫిన్ తీసుకుంది. పళ్ళదుకాణంలో రెండు ఏపుల్సు నాలుగు అరటిపళ్ళుకొన్నది రమాదేవికోసం.

సుమలత వరెండాలోకివస్తూనే ఆయానుపిలిచి అడిగింది - రమాదేవిని చూడటానికివచ్చాను వీలవుతుందా?" అని.

ఆయా మాట్లాడకుండా వెళ్ళిపోయింది. పిచ్చివాళ్ళను చూడాలంటే డాక్టరు అనుమతికావాలి. వాళ్ళు కొట్టినా, తిట్టినా పారిపోయినా అక్కడి నౌకర్లదే బాధ్యత.

సుమలత సాయంత్రంబండికి వెళ్ళిపోవాలనుకుంది. కేవలం చూసిరావటమే కదా అనుకుంది. ఆమె మళ్ళీ విజిటర్సు బెంచీదగ్గరికి వచ్చేసరికి మూడుగంటలు దాటింది.

డాక్టరు గదిముందర స్టూలుమీద ఒక నౌకరుకూర్చునిఉన్నాడు. ఆమె అతడితో కొంతసేపుమాట్లాడి, నాలుగురూపాయలు చేతిలోపెట్టి తన విజిటింగ్ కార్డు డాక్టర్‌కి చూపించమన్నది.

వెంటనే పిలుపువచ్చింది. "మిమ్మల్ని రమ్మంటున్నారు"అని.

డాక్టరు ఆమెతో పిచ్చివాళ్ళనుగురించి చాలాసేపు మాట్లాడేడు. ఆమె ఉద్యోగాన్ని గురించీ ఎవరిని చూడటానికివచ్చిందీ మొదలైన వివరాలడిగాడు కార్డు చూసికూడా.

ఎదురుచూసి ప్రాణంవిసిగిపోయిన సుమలత - తన అవసరంకదా అని ఓపికతో ఆయన ప్రశ్నలకన్నిటికీ సమాధానమిచ్చింది.

"మీరు లోపలికి వెళ్ళటానికివీలులేదు. రమాదేవిని విజిటర్సు గదిలోకి పిలిపిస్తాను మాట్లాడండి."

"ఆమె ప్రవర్తన ఎట్లాఉంది డాక్టర్? అసలామెకేమయింది?" ఆత్రంతో ప్రశ్నించింది—ఎటువంటిపరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందోనన్న భయంతో.

"ఆమె ఉద్రేకంతో ప్రవర్తిస్తోందని వాళ్ళ ఫామిలీడాక్టరు చెప్పాడట. భర్త కంప్లైంటుచేసి ఇక్కడచేర్పించాడు."

"ఆమె పరిస్థితి ఇప్పుడెట్లాఉంది?"

"ఆమె ఎవరితోనూ మాట్లాడదు. భోజనం సరిగా చెయ్యదు. ఒక మూలగా కూర్చుంటుంది జబ్బేమీ కనబడలేదు."

"నేను రాత్రి బండిలోనయినావెళ్ళి రేపు నా డ్యూటీలోచేరాలి. ఆమెతో రెండుమాటలు మాట్లాడివెళ్తాను. ఆమెను కలుసుకునే ఏర్పాటుచేయించండి ప్లీజ్."

ఆమెతో మాట్లాడుతూనే డాక్టరు గంటకొట్టి ఆయానుపిలిచి రమాదేవిని విజటర్సు గదిలోకి తీసుకురమ్మన్నాడు.

ఐదు నిమిషాల తరువాత—

"ఆమె వచ్చిందట మీరా గదిలోకివెళ్ళండి" అన్నాడు డాక్టరు.

రమాదేవి ఎట్లాఉన్నదోనని భయపడుతూ సన్నగాఒణుకుతున్న పాదాలతో, అడుగులో అడుగువేసుకుంటూ, ఆయా చూపించిన గదిలోకివెళ్ళింది సుమలత.

రమాదేవి గోడవైపు ముఖంపెట్టి, చేతులతో ముఖందాచుకుంటూ ఒదిగి కూర్చుంది-చింపిరిజుట్టుతో-మాసినచీరెతో. చిరిగినజాకెట్ తో.

ఆమెనుచూడగానే సుమలతకు దుఃఖం పెల్లుబికినట్లయింది. కళ్ళు తుడుచుకుని "రమా ఇటుతిరుగు" ఆమె వెన్నుమీద చేతులువేసింది.

"ఎవరునీవు?" ఒక్క కేకపెట్టింది రమ. ఆ కేక పిచ్చికేకలాఉంది.

"నేను రమా, నిన్ను చూడటానికివచ్చాను."

"నా ముఖం చూపించను వెళ్ళు నేను పిచ్చిదాన్నని తెలియదూ? వెళ్ళిపో ఇక్కడినుంచి"

"రమా, నేను లతనే, నిన్నుచూడాలని సెలవుపెట్టివచ్చాను. మనం కలుసుకుని చాలా రోజులయిందన్న బెంగతోవచ్చానే. ఇటుతిరిగిచూడు" సుమలత బలవంతంగా ఆమెను తనవైపుకు తిప్పుకుంది కాని-ముఖమ్మీదినుంచి చేతులను తియ్యలేకపోయింది.

"రమా, నీకోసం, పళ్ళుతెచ్చాను. ఈ పండుతిను" అరటిపండు ఒలిచి నోటికందించింది.

"నేను పళ్ళుతిననని తెలీదూ? నేను పళ్ళుతినే మనిషినికాను అసలు నీ వెందుకొచ్చావు ఇక్కడికి? వెళ్ళిపో" అరిచింది.

"రమా, నేను నీ స్నేహితురాలినే-లతను. నన్ను వెళ్ళిపొమ్మంటావా? మనం అరటిపండును చెరిసగంతుంచుకుని తినేవాళ్ళంకదే? మనిద్దరం ఒకే ప్రాణంగాఉంటూ చదువుకున్నాం మర్చిపోయావా? నీవు సగంతిను. నేను సగం తింటాను" బలవంతంగా ఆమె నోరుతెరిచి పండు లోపలికితోసింది.

నోట్లోనుంచి పండునుతీసి దూరంగాపారేసి "నన్ను చూడటానికివచ్చావా?" పిచ్చినవ్వు నవ్వింది.

"రమా, అట్లానవ్వకే నీ చేత్తో ఈపండు నా నోట్లోపెట్టవా? నీచేతిపండుతిని ఎంతకాలమయిందో? రమా, పెట్టవా?" పండు చేతికిచ్చి నోరుతెరిచింది.

"నాచేతులు మంచివికావని తెలీదూ? పోవే-ఇక్కడినుంచి ఆ పండు నీవేతిను" ఆమెకు దూరంగా జరిగికూర్చుంది.

"రమా, రాత్రిబండికి నేను వెళ్ళిపోవాలే. ఈ పండుతిని ఒక్కమాట మాట్లాడు. అది వినిపోతానే" లత బ్రతిమిలాడింది గడ్డంపట్టుకుని.

"లతా !" ఒక్క కేక పెట్టి ఆమె ఒడిలో పడిపోయింది రమ ఏడుస్తూ, బాల్య స్మృతులు కళ్ళముందు బొమ్మకట్టాయి.

"ఇప్పుడు తెలిసిందా నేనెవరినో ? నీ లతను. ఏడవకు. టైమయిపోతుంది. ముందు పళ్ళుతిందాం. నాకు ఆకలిగా ఉంది. ఈ పండు నానోట్లో పెట్టు" మళ్ళీ చేతికిచ్చింది పండు.

లతకు పండునోట్లో పెట్టేటప్పుడు, పిల్లలకు అన్నం నోట్లో పెట్టేటప్పుడు, తల్లినోరు దానంతట అదే తెరుచుకున్నట్లుగా రమనోరు తెరుచుకుంది.

వెంటనే లత మరో అరటిపండు ముక్కను ఆమె నోట్లో కుక్కింది.

లత మెడను రెండుచేతులతో పట్టుకుని "ఇక్కడికెందుకొచ్చావే ? నేను చచ్చిపోయానని తెలీదా లతా ?" పిచ్చిచూపులు చూసింది రమ.

లత నవ్వుతూ "నీవు బతికే ఉన్నావుగాని-నీ పిల్లలను వదిలిపెట్టి ఇక్కడెందుకున్నావు?"

"నాకు పిల్లలా ? నేను చచ్చిపోయానుగా ?"

"బాగా ఆలోచించి చెప్పు ? నీవు బతికేఉన్నావు చెప్పు ?"

"చెబితే నిజంగానే చచ్చిపోతాను. నా నోటితో చెప్పనుగాక చెప్పను"

"అబ్బా ! మొండిగా మాట్లాడకే రమా. మా యింటికివచ్చి చెబుతావాపోనీ?"

"మీ యింటికా ? ఈ పిచ్చిది ? రాదు."

"మరి-నీ సంగతి నాకు తెలిసేది ఎట్లా ? నీ పిల్లలు నా దగ్గరున్నారు. నోటితో చెప్పకపోతే కాగితమ్మీద రాసివ్వు నిన్ను తీసుకెళ్ళి నీ పిల్లలకు చూపిస్తాను"

"లతా, చెప్పమంటావా ? నోటితో చెప్పలేను. రాసిఇస్తాను చదువుకో" రాసి యిచ్చింది.

లత చీటీ చదివింది "ఒకరాత్రి వేళ బాగా తాగివచ్చి తలుపు తీయమన్నాడు శ్రీకంఠం." అంటూ కాగితంపైన రెండువైపులా రాసి ఇచ్చింది. దాన్ని పూర్తిగా లత చదువుకుంది. ముఖం ఎర్రబడ్డది. పళ్ళు పటపట కొరికింది. ఆవేశంతో కంఠం బిగుసుకున్నట్లయింది. గుండెలు గబగబా కొట్టుకొంటున్నాయి.

"ఆడపిల్ల పద్నాలుగేళ్ళది. ఆ పిల్లనదోగతి పాలుచేస్తాడు. అబ్బాయికి బుద్ధితెలుస్తున్నది. రమా, నేను ఈ రాత్రికి ఒక లేడీలాయరింట్లో ఉండి రేపు మీ పిల్లల స్కూళ్ళకువెళ్ళి, టి.సి.లు తీసుకుంటాను. వాళ్ళు ముగ్గురినీ నా వెంట తీసుకుపోతాను. ఇంట్లో మా అమ్మ పెద్దది ఉంది. ఆమె చూసుకుంటుంది. అక్కడే స్కూళ్ళల్లో చేర్పిస్తాను. వాళ్ళింక మీ యింటికి వెళ్ళరు. అటునుంచిఅటే తీసుకు వెళ్లాను. నేను మళ్ళీ వచ్చేవారం వస్తాను. డాక్టరుతో మాట్లాడి నిన్నుకూడా తీసుకు వెళ్తాను. నీవు ధైర్యంగా ఉండు."

రమను గుండెకు హత్తుకుని కన్నీళ్ళు తుడుస్తూ "బి.కామ్ అయిన తరువాత నేను లా చదువుదామంటే నీవు వాడిప్రేమలో పడి పెళ్ళిచేసుకున్నావు. నేను లా చదివి ఉద్యోగం చేస్తున్నాను. నా అసిస్టెంటుచేత కేసంతా నడిపిస్తాను. నీకు విడాకులు కూడా ఏర్పాటుచేస్తాను. నీవు మళ్ళీ ఆ యింట్లో అడుగుపెట్టక్కర్లేదు. నీవు మళ్ళీ కోర్టులోనే ఆ శ్రీకంఠాన్ని చూస్తావు. అంతే కథ."

"ముగ్గురు పిల్లలతో మీయింట్లో ఉండనా? నేను ఆ పిల్లలకోసమైనా బతకాలి. నాకేదయినా ఉద్యోగం...."

"ఇప్పిస్తాను. తెలిసినవాళ్ళ ద్వారా ప్రయత్నాలుచేస్తాను. ఇంతవరకూ వచ్చిన తరువాత నీకు ఉద్యోగం ఇప్పించలేకపోతానా? మరి-నీవు ధైర్యంగా ఉండాలి" ఆమె ముఖాన్ని రెండుచేతులలోకి తీసుకుని, "పిల్లలమీద బెంగపెట్టుకోకు. నా సంగతి తెలుసుగా నీకు? అన్నమాట చేసి చూపించనిదీ నిద్రపోను" అంది ధైర్యంచెబుతూ.

"ధైర్యంగానే ఉంటాను. ఎవరితోనూ మాట్లాడనన్న పేరు రానేవచ్చింది. నీవు నన్ను కాపాడటానికి వచ్చిన దేవతవుగాని బాల్యస్నేహితురాలయిన సుమలతవుకావు" భుజాలచుట్టూ చేతులువేసింది.

"అయితే ఈ రెండు ఏపుల్స్ నా ముందుతిను. రమా, నన్ను ధైర్యంతో సాగనంపు" వళ్ళు తినిపించి, లేస్తూ "చూడు. శుభ్రంగా స్నానంచేసి మంచిచీర కట్టుకో. డాక్టర్లు వచ్చినప్పుడు పిచ్చిదానిలా కాక ధైర్యంగా మాట్లాడు. మరి-నేను వెళ్ళిరానా ?"

"వెళ్తావా ?" కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ "నాకు కొండంత అండగా నిల బడతానంటున్నావు" అంటూ ఆమెను చేతులతో చుట్టేసింది రమ.

ఇద్దరూ కళ్ళుతుడుచుకున్నారు. తలుపుతెరిచి లత బైటికివచ్చింది. మరొక సారి డాక్టర్ని కలుసుకుని, నేను మళ్ళీ వారానికి ఇక్కడికివస్తాను. డాక్టర్, మీరు నాకు సహాయంచెయ్యాలి. బలమైన ఆధారం దొరికింది నాకు" అంటూ ఆయనకు నమస్కారంచేసి గేటుదాటి. "స్త్రీ ఎంతచదువుకుని పైస్థాయికి చేరుకున్నా ఇటు వంటి ఘాతుకచర్యలకు లొంగిపోవలసిందేనా ? స్త్రీకి రక్షణ ఎక్కడ ? రక్షకు లెవరు ?" నుదురు కొట్టుకుంది.

మరునాడు ఉదయం రమకు చెప్పినట్టుగా పిల్లల స్కూళ్ళకువెళ్ళి హెడ్ మాస్టర్లతో మాట్లాడి, అప్పటికప్పుడు టి.సి. తీసుకుని పిల్లలను తనతో తీసు కెళ్ళింది.

"అమ్మను తీసుకువస్తాను. మీకేం భయంలేదు. ఇక్కడ స్కూళ్ళలో చేర్పిస్తాను. మీరు చదువుకొంటూ ఉండండి. మీకేం కావాలన్నా మామ్మగారి నడ గండి. ఆమెకు పిల్లలంటే ఎంతోఇష్టం. మీకు స్కూల్లోనే పుస్తకాలు ఇస్తారు. డబ్బు కట్టేశాను. జాగ్రత్తగా ఉండండి"వాళ్ళ బుజాలమీద చేతులువేస్తూ ధైర్యం చెప్పి మళ్ళీ వారానికల్లా పిచ్చాసుపత్రికి వచ్చింది.

ఈసారి తిన్నగా డాక్టరు గదిలోకి వెళ్ళింది.

"డాక్టర్, రమాదేవి పరిస్థితి ఇది. ఆమెకు ఏ జబ్బులేదు. పిచ్చి అంత కంటేలేదు. నేను అప్లికేషన్ రాసియిస్తాను. ఆమెను నాతో పంపించెయ్యండి. ఆమెపిల్లలు నా దగ్గరేఉండి చదువుతున్నారు. ఆమెకు ఒక ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం కూడా చూశాను. అక్కడినుంచే డైవోర్సు ప్రొసీడింగ్సు

నడుస్తాయి. ఒక పిల్లలతల్లిగా ఆమెకు మీరు సహాయం చెయ్యండి" అంటూ ప్రాధేయ పూర్వకంగా అడిగింది.

"తప్పకుండా మీతో సహకరిస్తాను. ఆమెకు కొత్త జీవితాన్ని కల్పిస్తానని మీ అంతటివారు వచ్చి అడిగితే డిస్చార్జి చెయ్యకుండా ఉంటానా? నేనూ నాకు చేతనయినంత సహాయంచేస్తాను. మీరు వ్రాతపూర్వకంగా అప్లికేషనివ్వండి" అని టైపిస్టును పిలిచి ఆమె రాసినదాన్ని టైపుచేసి తీసుకురమ్మన్నాడు. ఆయనే అక్కడ పెద్దడాక్టరు. మిగతావాళ్ళచేత కూడా సంతకాలు పెట్టించి విడుదలపత్ర మొకటి తన ఫైల్లో పెట్టుకుని ఆమెకొక కాపీ ఇచ్చాడు.

సుమలత కృతజ్ఞతా పూర్వకంగా వాళ్ళందరికీ చేతులు జోడించింది. తను తీసుకువచ్చిన బట్టలు రమాదేవిని కట్టుకోమని చెప్పి, ఆయాలకందరికీ ఇనామ్‌లు ఇచ్చి, ఆమెను తీసుకుని వెళ్ళిపోయింది.

రమాదేవి సుమలత బాల్యస్నేహితుల్లా కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణం చేశారు. చిన్ననాటి కబుర్లు చిలిపికజ్జాలు జ్ఞాపకం చేసుకుని పగలబడి నవ్వుకున్నారు. రెండు రోజుల తరువాత రమాదేవి ఉద్యోగంలో చేరింది.

సుమలత తన స్నేహితురాలైన లాయరుచేత శ్రీకంఠమ్మీద కేసు పెట్టించింది. విడాకులకు నోటీసు ఇప్పించింది.

భార్యను హింసించి స్నేహితులను ఇంటికి తీసుకువచ్చి మానభంగం చేయించినందుకు శ్రీకంఠానికి కారాగార శిక్షపడ్డది. వెంటనే విడాకులు ఇవ్వటం కూడా పూర్తిఅయింది.

"రెండుమాటలు నా భార్యతో మాట్లాడటానికి అనుమతి ఇవ్వమ"ని శ్రీకంఠం జైలుకు వెళ్ళేముందర పోలిసాఫీసర్‌ను అర్థించాడు. పిల్లలనొకసారి చూస్తానని ప్రాధేయపడ్డాడు.

సుమలత గవర్నమెంటు ప్లీడరుగా అభ్యంతరం చెబుతూ "నీవు నీ పిల్లల దృష్టిలో చనిపోయావు. నీ భార్యదృష్టిలో వేశ్యమాతకంటె అధమాధముడివి. మళ్ళీ నీ ముఖం వాళ్ళకెందుకు చూపిస్తావు! జరిగినదంతా ఒక పీడకలగావాళ్ళను మరిచిపోనీయ్." అంటూ రమాదేవిని తీసుకుని ఇంటికి వెళ్ళిపోయింది.

"ఒక ఆడది ఇంతపనిచేస్తే నేనేనా చేతకానివాడిని ? "రమాదేవిని అనవస రంగా విడుదల చేసినందుకు డాక్టరుమీద చర్యతీసుకోవలసినది"గా ఒక కంప్లైంటు రాశాను. ఇది ఆ డైరక్టరుకు అందజేయండి. ఇది నా కోరిక" అంటూ పోలీసాఫీ సరు చేతికి ఇచ్చాడు శ్రీకంఠం.

దారిలో రమాదేవితో "రమా, నాకు మగవాళ్ళమీద కోపంలేదు. కాని-కొందరుచేసే దారుణకృత్యాలపట్ల విపరీతమైన ఏహ్యాభావం ఉంది. మీ ఇద్దరూ పెళ్ళిచేసుకుని పిల్లలతో సుఖంగాఉంటే అంతకంటె కోరుకోతగినదేముందని సంతోషించాను. కాని-అతడుచేసిన ఘాతుకకృత్యము నీ జీవితాన్ని నీ పిల్లల భవిష్యత్తును కూడా నాశనంచేస్తుంది. అందుకే విడాకులివ్వమన్నాను నిన్ను. మీ యిద్దరినీ విడదీశానని నీవుగాని, నీ పిల్లలుగాని ఎప్పటికీ అనుకోమని నాకు మాట యివ్వాలి. మరొకసంగతి. విడాకులివ్వకపోతే పిల్లలతో నిన్ను ఇక్కడ ఉండ నివ్వడు. నీ జీవితం మళ్ళీ మొదటికివస్తుంది. ఇట్లా అంటున్నానని కోపం తెచ్చు కోకు రమా'' అన్నది సుమలత తన స్నేహితురాలి అంతర్యాన్ని మరొకసారి శోధిస్తూ,

"లతా ! నాకు జీవితమ్మీద ఆశఉండి నీతో వచ్చాననుకుంటున్నావా? నాకు జీవితమ్మీద ఆశకాదే-అసహ్యం పుట్టింది. నేను పిల్లలకోసం బతకాలనుకున్నాను. నీవు అండగా నిలబడ్డావు కనుక దానికయినా అవకాశం దొరికింది. లేకపోతే నేను ఎప్పుడో నా పైటకొంగుతో ఉరివేసుకుందామన్న ఆలోచనలో ఉన్నాను. కాని-అవకాశం దొరకలేదు. నేను ఆస్పత్రినుంచి బైటికివచ్చిన తరువాత ఆముఖం మళ్ళీ చూస్తానని కలలోనయినా అనుకోకు. నేను భార్యను అంగడిబొమ్మగాచేసిన వాడిని ఇంక తలుచుకోనైనా తలుచుకోను. మానవుడు మహనీయుడు కాగల అవ కాశాలను వదులుకొని దుర్మార్గాలకూ దౌర్జన్యాలకూ దిగజారిపోతున్న వాళ్ళలో ఆ నీలకంఠం ప్రథముడుగా నా కళ్ళకు కనిపిస్తున్నాడు. అతడితో నాకుగాని పిల్లలకు గాని ఏ సంబంధమూ ఉండబోదు. ఈ నిశ్చయానికి వచ్చిన తరువాతనే పిల్లల కోసం జీవించాలన్న బాధ్యతతో నీ వెంటవస్తున్నాను. లతా, ఇంత ఉపకారంచేసిన నీకు నేనేమివ్వగలను ? ఋణమెట్లా తీర్చుకోను? నీవే నా దేవతవని పదేపదే ప్రాతః స్మరణతప్ప మరొకటి తోచటంలేదు" ఆమె గుండెలో తలదాచుకుంది రమ.

"అబ్బ, ఎంతబరువైన డైలాగులు ? చాల్లేనీ పొగడ్తలు. పండుతినమని బ్రతిమిలాడితే విసిరికొట్టావుగాని ? మన స్నేహాన్ని ఎన్నిసార్లు జ్ఞాపకంచేసినా వినిపించుకున్నావా ? ఇప్పుడు గొప్పగా స్తోత్రం చేయటం మొదలుపెట్టావు" అంది లత కోపంఅభినయిస్తూ.

"కోప్పడకు లతా. అప్పుడు నేను పిచ్చిదాన్నికదుటే ?" అంది రమ లత మనసు కరిగిపోయేటట్టు.

✻✻